

జిఒ 117తో విద్యారంగానికి నష్టం : యుటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యా రంగానికి నష్టం చేకూర్చే జీవో 117ను రద్దు చేసి, బదిలీలు, ఉద్యోగోన్నతులు కల్పించాలని యు టి ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఅర్ కె ఈశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలను ఉన్నతపాఠశాలలో విలీనం చేయడం ఆపాలని, కేవలం ఇంగ్లీషు మీడియంనే ఉన్నతపాఠశాలలో నిర్వహించడం, యుపి, హై స్కూళ్లలో సెక్షనుకు 60 మంది విద్యార్థులుగా నిర్ణయించటం మూలంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. కావున వెంటనే జీవో 117ను రద్దు చేయాలని, ప్రతి పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలు నిర్వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు రద్దుచేయాలని, ఉన్నత పాఠశాలలో శాశ్వత ప్రాతిపదికన ప్రయోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేడర్ వారీగా బదిలీ కౌన్సిలింగ్ నిర్వహించి ప్రత్యక్ష కౌన్సిలింగ్ ద్వారా పదోన్నతులు నిర్వహించాలని కోరారు.

నిలిచిపోయిన గడిగెడ్డ అభివృద్ధి పనులు

గడిగెడ్డపై శీతకన్ను

మండలంలో ఏకైక సాగునీటి ప్రాజెక్టు గడిగెడ్డ రిజర్వాయర్. ఈ ప్రాజెక్టు 2,990 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. 1966 నుండి రైతులకు సాగునీరు అందిస్తూ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తోంది. రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల ద్వారా సాగునీరు అందిస్తోంది. అలాంటి ప్రాజెక్టుపై ప్రభుత్వం శీతకన్ను వేసింది. అభివృద్ధి పనుల్లో జాప్యంతో లక్ష్యం మేర సాగునీరు అందడం లేదు. మరోవైపు తోటపల్లి కాలువ నీరు అందిస్తామని ప్రకటించినా ఏళ్లుగా ఎడతెగని జాప్యం కొనసాగుతోంది.

- అభివృద్ధి పనులకు అంతరాయం
- ముందుకు కదలని రిజర్వాయర్ పనులు
- అందని ద్రాక్షలా తోటపల్లి నీరు

ప్రజాశక్తి - గుర్ల

గడిగెడ్డ ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా పకీరుకిత్తలి, బూర్లిపేట, పల్లిగండ్రేడు, గరికివలస, గజపతినగరం మండలంలోని కెంగువ గ్రామానికి సాగునీరు అందిస్తోంది. ఎడమ కాలువ ద్వారా తెట్టంగి, గూడెం, పాలవలస, పున్నపురెడ్డి పేట గ్రామాలకు సాగునీరు అందుతోంది. ఖరీఫ్ సాగులో వరి పంటకు నీరు అందిస్తూ వేసవి కాలంలో నెల్లిమర్ల, విజయనగరం పట్టణాలకు తాగునీరు అందిస్తుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కుడి, ఎడమ కాలువలను సిమెంట్ కాలువలుగా అభివృద్ధి చేయడానికి రూ.13 కోట్ల నిధులు ఖర్చు చేశారు. దీని వల్ల నీటి సరఫరాలో నీటి వృథాను అరికట్టారు. గడిచిన టిడిపి ప్రభుత్వంలో తోటపల్లి నుండి గడిగెడ్డకు సాగునీటిని అందించారు. తోటపల్లి కాలువ ఒక కిలోమీటర్ దూరం వరకు పనులు పూర్తి కావాల్సి ఉంది. గడిగెడ్డ అభివృద్ధి పనుల కోసం రూ.16 కోట్ల నిధులు విడుదల చేశారు. దీనికి 2018లో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం పనులు అప్పగించింది. పనులు మొదలు పెట్టే సమయానికి ఎన్నికలు దగ్గర పడటం, టిడిపి పరాజయం పాలవడంతో పనులు నిలిచిపోయాయి. వైసిపి అధికారంలోకి రావడం, రివర్స్ టెండర్ల క్రమంలో గడిగెడ్డ అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. కాగా తోటపల్లి నీరు కూడా పూర్తిస్థాయిలో గడిగెడ్డకు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

బాబు జగ్జీవన్‌రాం ఉత్తరాంధ్ర సృజల స్రవంతి ఎడమ కాలువ ద్వారా గడిగెడ్డ రిజర్వాయర్‌కు సాగునీరు అందించి, మరింత ఎక్కువ భూములకు సాగునీటిని అందించేందుకు కృషి జరుగుతుందని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. కాలువ పనుల నిమిత్తం భూ సేకరణ కోసం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభలు నిర్వహించారు. పోలవరం ప్రాజెక్ట్ నుండి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా గడిగెడ్డ రిజర్వాయర్‌కు నీరు అందిస్తే గుర్ల, గజపతినగరం మండలాలు సస్యశ్యామలం అవుతాయని రైతులు చెబుతున్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అప్పటి ఎమ్మెల్యే మృణాళిని

జిల్లా అధికారులే రావాలి

అసంతృప్తి వినతులపై కలెక్టర్ సమీక్ష ● స్పందనకు 162 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్నకు చెపుదాం, స్పందనకు జిల్లా అధికారులే హాజరు కావాలని, కింది స్థాయి అధికారులను పంపవద్దని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం నిర్వహించే జెకెసికి అత్యంత ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. ఏ అధికారి కూడా సోమవారం ఎలాంటి సమావేశాలు, సమీక్షలు, పర్యటనలు చేయరాదని, అనుమతి లేకుండా గైర్హాజరు అయితే చార్జ్ మెమోలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమం లో పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అనే ప్రతిజ్ఞ డిఆర్ఒ చదువగా అధికారులంతా అనుసరించారు. సోమవారం స్పందన వినతులను కలెక్టర్ నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్, ఆర్‌డిఒ సూర్యకళ, డిఆర్ఒ గణపతిరావు, డిప్యూటీ కలెక్టర్లు పద్మలత, సుదర్శన దొర, సూర్యనారాయణ తదితరులు స్వీకరించారు.

అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఈనెల 9 నుంచి ప్రారంభమైందని, నేటి వరకు అందిన దరఖాస్తులలో సుమారు 50 శాతం అర్జీదారులకు కాల్స్ చేయగా అందులో 50 శాతం వరకు సంతృప్తి చెందినట్లు సమాధానం వచ్చిందని తెలిపారు. మిగిలిన వారు అసంతృప్తి చెందడానికి గల కారణాలేమిటని కలెక్టర్ ప్రశ్నించారు. ముఖ్యంగా హౌసింగ్, పంచాయతీరాజ్ , మున్సిపల్, పోలీస్ మొదలైన శాఖలకు చెందిన దరఖాస్తులలో అర్జీదారు అసంతృప్తి కనపడుతోందని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి కేసు ను సమీక్షించి కారణాలను అడిగారు. సులువుగా పరిష్కరించగలిగే వినతులను కూడా సరిగ్గా పరిష్కరించని వారికి చార్జ్ మెమోలు ఇస్తామని తెలిపారు. ఒకే రకమైన వినతులు మళ్ళీ మళ్ళీ వచ్చినా, ఒకే ప్రాంతం నుండి మళ్లీ మళ్లీ వచ్చినా వాటి పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారి పర్యటనలో సచివాలయాల్లో పెండింగ్ వినతులను, పరిష్కారాల విధానాన్ని పరిశీలించాలని తెలిపారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

గంట్యాడ పోలీసు స్టేషనులో 2019 అక్టోబర్ 10న నమోదైన పోక్సో, అట్రాసిటి కేసులో నిందితుడైన గంట్యాడ మండలం కొండతామరాపల్లికి చెందిన సారిపల్లి చిన్నారావు (65)కు 20ఏళ్లజైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పిందని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. నిందితుడు సారిపల్లి చిన్నారావు బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో ఆయనపై పోక్సో చట్టం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసును ఎస్ఐ కె.కృష్ణవర్మ నమోదు చేశారు.

విజయనగరం ఎస్సీ, ఎస్టీ సెల్-1 డిఎస్పీ బి. మోహనరావు దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. కేసు విచారణ అనంతరం ఇన్చార్జ్ పోక్సో కోర్టు ఫోర్త్ అడిషనల్ జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా నిందితుడు సారిపల్లి చిన్నారావుకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన విజయనగరం రూరల్ సిఐ టివి తిరుపతిరావు, గంట్యాడ ఎస్ఐ కిరణ్ కుమార్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

సాధించిన పతకాలతో క్రీడాకారులు

బాక్సింగ్‌లో ఓవరాల్ ఛాంపియన్ విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి 6వ యూత్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో 13 విభాగాలకు గాను 8 విభాగాల్లో పతకాలు సాధించి ఓవరాల్ రన్నర్ ఛాంపియన్‌షిప్‌ను విజయనగరం సొంతం చేసుకుంది. వీరిలో పి.దేవ కుమార్ (80-86కేజీలు), బి.చంద్ర శేఖర్ (86-92కేజీలు) బంగారు పతకాలు, ఎస్.తేజేశ్వర్ (46-48కేజీలు), ఎస్. మోహన్ రావు (70-78 కేజీలు) వెండి పతకాలు, సిహెచ్ చంద్ర శేఖర్ (51-54), జె.వసంత్ (54-56), కె. రవితేజ (57-60), బి. మనోజ్ (66-70) కాంస్య పతకాలు గెలుపొందారు. బంగారు పతకాలు సాధించిన పి. దేవ కుమార్, బి. చంద్ర శేఖర్ త్వరలో సిక్కింలో జరిగే యూత్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రీడాకారులను బాక్సింగ్ ఆసోయేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మధకుమార్, శాప్ కోచ్ బి. ఈశ్వరరావు, సభ్యులు ఎస్ఇ రాజు, డి.మురళి, బి. జగదీష్, బాక్సింగ్ రింగ్ అఫీషియల్ వి.సంతోష్ కుమార్, పి.శ్రీనివాస రావు, బి. ప్రసాద్ అభినందించారు.

రవాణా ఛార్జీల కుంభకోణంపై విచారణ చేపట్టాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ ● కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఖరీఫ్‌లో ధాన్యం రవాణా, కలాసీ ఛార్జీల కుంభ కోణంపై విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిని తీవ్రంగా శిక్షించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రవాణా ఛార్జీల్లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన సోమవారం ధర్నా చేశారు. ఈం సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ 2021-22 ఖరీఫ్ ధాన్యం రవాణా, హమాలీ ఛార్జీలను రైతులకు ఖాతాలకు వేయకుండా బినామీ ట్రాన్స్ పోర్ట్ ఏజెన్సీలకు ప్రభుత్వం వేసిందని అన్నారు. 80శాతం మంది రైతులు తమ ధాన్యాన్ని మిల్లులకు సొంతంగా వారే చేర్చారని, అర్‌బికెలో వాహనం నంబర్ రిజిష్టర్ చేసిన వాటికి నమోదు చేయకున్నా బినామీ ట్రాన్స్ పోర్ట్ ఏజెన్సీలు రవాణా చేసినట్లు రికార్డు చేసి ఇప్పుడు వచ్చిన ఖర్చులను వారికి ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, క్వింటాకు రవాణా రూ.25, హమాలీ ఛార్జి రూ.27 చొప్పున రైతులకు క్వింటాకు రూ.52 ఇవ్వాలని, ఈ విధంగా మొత్తం రూ.20కోట్లు వరకు అవినీతి జరిగిందని వివరించారు. తక్షణమే విచారణ చేసి రైతులకు రావాల్సిన రవాణా, హమాలీ చార్జీలు ఇవ్వాలని, బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతి అందజేశారు. విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు, ఉపాధ్యక్షులు ఎల్.ఆదినారాయణమూర్తి, నందా మాజీ ఎంపిటిసి పైడిరాజు, కౌలురైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాకోటి రాములు, తొత్తడి పైడపు నాయుడు, పెంటయ్య, అప్పలనాయుడు,గెద్దలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బుడతనాపల్లి, వసాది, నందాం, నరవ, గొల్లు పాలెం, జయతి, లక్కిడాం, చంద్రం పేట, మరిపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు

ఎఎస్‌పి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా నియమితులైన అస్మా ఫర్హీన్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అదనపు ఎస్‌పిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమెను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అదనపు ఎస్‌పిగా నియమించింది. బాధ్యతలు చేపట్టిన అస్మా ఫర్హీన్ ఎస్‌పి ఎం.దీపికకు మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ ను, డిఎస్‌పిలు ఆర్.శ్రీనివాసరావు, ఆర్.గోవిందరావు, సిఐలు సిహెచ్. లక్ష్మణరావు, జె.మురళి, జి.రాంబాబు, ఇ.నరసింహమూర్తి తదితరులు అభినందించారు.

ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎఎస్‌పి

కలెక్టరేట్‌లో మామిడి పండ్ల స్టాల్స్

విజయనగరం : కలెక్టరేట్ ప్రాంగణంలో కిసాన్ క్రాంతి ఎఫ్‌పిఒ ద్వారా ఏర్పాటు చేసిన మామిడి పండ్ల స్టాల్స్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్ సందర్శించారు. ఎఫ్‌పిఒ ద్వారా రైతుల నుంచి మామిడి పండ్లను సేకరించి అపార్టుమెంటు సముదాయాల్లో విక్రయిస్తున్నట్టు ప్రతినిధులు తెలిపారు. రసాయనాలు వాడకుండా పండించిన మామిడి పండ్లను స్టాల్స్ ద్వారా, అపార్టుమెంట్ సముదాయాల్లో నేరుగా విక్రయించడం వల్ల రైతులకు మంచి లాభం చేకూరుతుందని చెప్పారు. కలెక్టర్, జెసిలు స్టాల్ నుంచి మామిడి పండ్లను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో నాబార్డు డిడిఎం నాగార్జున, వ్యవసాయ శాఖ జెడి వి.టి.రామారావు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

పెరిగిన ఎఎంసి ఆదాయం

బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మార్కెట్ కమిటీ ఆదాయం గణనీయంగా పెరిగింది. బొబ్బిలి మార్కెట్ కమిటీ 2022-23 ఏడాదికి రూ. రెండు కోట్ల ఆరు లక్షల ఆదాయంగా లక్ష్యాన్ని నిర్దేశించుకోగా రూ.2కోట్ల 99లక్షలు ఆదాయం వచ్చింది. బొబ్బిలి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మూడు చెక్ పోస్టులు ఉన్నాయి. బొబ్బిలిలోని ఐటిఐ కాలనీ, తెర్లాం మండలంలోని టెక్కలివలస, రామభద్రపురం మండల కేంద్రంలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు రవాణాపై చెస్ వసూలు చేస్తున్నారు. గతేడాది ధాన్యం, మొక్కజొన్న, పత్తి, ఇతర వాణిజ్య పంటలు రవాణా అధికంగా జరగడంతో మార్కెట్ కమిటీ ఆదాయం గణనీయంగా పెరిగింది.

రైతులకు మెరుగైన సేవలు

మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని ఎఎంసి ఛైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు అన్నారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులు వలన మార్కెట్ కమిటీకు మంచి ఆదాయం వస్తుందన్నారు. బొబ్బిలిలో రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎఎంసి కమిటీలో చర్చించి తీర్మానం చేస్తామన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బాడంగి

గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బోగి గౌరి అధ్యక్షతన మండల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి జెడ్‌పి ఛైర్మన్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పేదలకు చెందాలనే ఉద్దేశంతో ఉంటే అధికారులు ప్రజలకు చేర్చడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించడం లేదన్నారు. ఒక్కొక్క శాఖకి చెందిన అధికారులతో మాట్లాడి గ్రామాల్లో ప్రగతిపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్‌పి డిప్యూటీ సిఇఒ రాజగోపాల్, జెడ్‌పిటిసి రామారావు, వైస్ ఎంపిపిలు రమేష్, సింగిరెడ్డి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి, చిత్రంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

వందశాతం సంతృప్తి చెందేలా..

- 'జగనన్నకు చెబుదాం'పై కలెక్టర్ నాగలక్ష్మి
- మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-విజయనగరం

ఫిర్యాదు దారులు శతశాతం సంతృప్తి చెందేలా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న ఈ కార్యక్రమంపై మండల, జిల్లా స్థాయి అధికారులంతా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, మండల ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం (జెకెసి), నాడూ-నేడు, గడప గడపకు మన ప్రభుత్వం, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలపై మండలాల వారీగా సమీక్షించారు. స్పందన ఫిర్యాదుదారులను శతశాతం సంతప్తి పరిచే బాధ్యత మండల స్థాయిలో ఎంపిడిఒలు, తాహశీల్దార్లపైనే ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయికి వెళ్లి వారి సమస్యను పరిశీలించాలని సూచించారు. అసంతృప్తి వ్యక్తం చేసిన వారితో నేరుగా మాట్లాడాలని అన్నారు. ఎపి సేవా పోర్టల్‌లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంపై, రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌పై అవగాహన

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇటీవలే ప్రారంభించిందని, దీనిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. వైద్యులు గ్రామాలకు వెళ్లే షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించాలని, సంబంధిత సచివాలయంలో, ఇతర చోట్ల ఈ షెడ్యూల్ను ఉంచాలని చెప్పారు. వైద్యులు గ్రామాలకు సకాలంలో వస్తున్నదీ లేనిదీ గమనించాలని సూచించారు. ఉదయం సాధారణ రోగులను పరిశీలించడంతోపాటు, మధ్యాహ్నం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించాలని తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

నాడు-నేడు, గడప గడపకు మన ప్రభుత్వం, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి నాడూ-నేడు పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద ఇప్పటివరకు 1008 పనులను మంజూరు చేశామని, మరో 157 పనులను ఆమోదించవలసి ఉందని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, హాజరైన జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు

ఇళ్ల స్థలాల అక్రమాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-బొబ్బిలి

రామభద్రపురం మండలం కొండకెంగువ గ్రామంలో జగనన్న ఇళ్ల స్థలాల అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి బి.శ్రీనివాసరావు, సర్పంచ్ కె.సుజాత.. ఆర్‌డిఒ పి.శేషశైలజకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా వైసిపి కార్యకర్తలకు ఇచ్చేందుకు అధికారులు, అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరితే సర్పంచ్‌కు కూడా చెప్పకుండా అనర్హులకు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. పట్టాలు లేకుండా అనేకమంది ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇళ్ల స్థలాల అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ స్పందిస్తూ దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్‌డిఒకు ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నాయకులు

స్పందించారు.. శుభ్రం చేశారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి వేపాడ

మండలంలో బక్కునాయుడుపేట వద్దనున్న బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో పిచ్చి మొక్కలు పెరగడం, బండరాళ్లతో విద్యార్థులకు ఇబ్బందులపై 'ప్రజాశక్తి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ నాగలక్ష్మి స్పందించారు. ఆర్‌డిఒ ద్వారా తహశీల్దార్ కృష్ణంరాజును ఫోన్‌లో సంప్రదించి, వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఆగమేఘాల మీద వసతిగృహానికి చేరుకుని, జెసిబిని రప్పించారు. పిచ్చి మొక్కలు, బండరాళ్లను తొలగించారు. మట్టిని తెప్పించి ఆవరణమంతా చదును చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణంరాజు, డిటి సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, విఆర్ఒ బాల భాస్కరరావు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులపై తక్షణ చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం

స్పందన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్‌పి ఎం.దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందనలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులను సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. నెల్లిమర్ల మండలం అలుగోలు గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు చేస్తూ తనకు శ్రీకాకుళం జిల్లా గార మండలానికి చెందిన వ్యక్తితో 2009లో వివాహం జరిగిందని, ప్రస్తుతం ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారని, అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నాడని తెలిపారు. విజయనగరానికి చెందిన ఓ మహిళ తన భర్త అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నాడని తెలిపింది. బొబ్బిలి పట్టణానికి చెందిన మహిళ ఫిర్యాదు చేస్తూ తన ప్రాంతానికి చెందిన కొంతమంది వ్యక్తులు తన వద్ద నుండి డబ్బులు తీసుకొని, ఫైనాన్స్ వ్యాపారులతో కుమ్మక్కై తనను మోసం చేశారని న్యాయం చేయాలని కోరింది. రాజాం మండలం డోలపేటకు చెందిన ఒక వ్యక్తి తన ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి రియల్ ఎస్టేటు వ్యాపారం చేస్తూ, తనకు తెర్లాం మండలం పెరుమాళిలో 1-07 ఎకరాల వ్యవసాయ భూమిని చూపించి, తనకు తప్పుగా రిజిస్ట్రేషను చేయించి, డబ్బులు తీసుకొని, మోసగించారని, న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదులు స్వీకరించిన ఎస్‌పి తక్షణమే స్పందించి వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టిసెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐలు రాంబాబు, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్

జగనన్నకు చెబుతాంపై సమీక్ష

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఇంతవరకు గ్రామ సచివాలయాలలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, పిఆర్ ఇంజినీరింగ్ అధికారి మహమ్మద్ కుర్షిత్ ఆలీ సమావేశానికి హాజరైన వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన కన్నెంగెడ్డ ప్రక్షాళన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో శృంగవరపుకోట మేజర్ పంచాయతీలో ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు కన్నెంగెడ్డను యుద్ధ ప్రాతిపదికన ప్రక్షాళన చేపట్టినట్లు సర్పంచ్ సంతోషి కుమారి తెలిపారు. గెడ్డనీరు రోడ్లపైకి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు వివరించారు. జెసిబి సహాయంతో సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున కన్నెగెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోపాడ కుమార్, వార్డు సభ్యులు శేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది నాయుడు, శానిటరీ మేస్త్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఖాళీల భర్తీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల)లో అధ్యాపకులు సోమవారం విధుల్లో చేరినట్లు హెచ్ఎం బి.లక్ష్మి తెలిపారు. రహీం షేక్ లాల్ (తెలుగు), ఎస్‌విఎస్ఎన్ మూర్తి (ఇంగ్లీష్), కోటంశెట్టి జయలక్ష్మి (ఫిజిక్స్), తమ్మినాన రాజేష్ (కెమిస్ట్రీ), పొట్నూరు శివాజీ (బోటనీ), అరసాడ సురేంద్రనాథ్ (జువాలజీ)ను ప్రభుత్వం నియమించినట్లు వివరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సు ప్రవేశ పెడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.కేశవరావు తెలిపారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు నెలల శిక్షణ అనంతరం ప్రముఖ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 7995691295, 9000234642 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాపుసోంపురం గ్రామానికి చెందిన దాసరి అప్పారావు కుటుంబానికి, మరుపల్లిలో పిడుగుపాటుకు గురై 17 మేకలను కోల్పోయిన దేవర సింహాచలం కుటుంబానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఆయా గ్రామాలకు వెళ్లి బాధితులను పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, నాయకులు ఇందుకూరి శ్రీను రాజు, ఇందుకూరి సత్తిబాబు రాజు, తూర్పాటి ఆదిబాబు, శివ, దాసరి సంతోష్‌కుమార్, చెక్కా కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుపిసిలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని రంగుపురం, కొత్తవలస గ్రామాలకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు సోమవారం జెడ్‌పిటిసి గార తవుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి,పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మణ, ఇఒపిఆర్‌డి జి.జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-వేపాడ

ఈనెల 27, 28వ తేదీల్లో రాజమండ్రిలో మహానాడును విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు కోరారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలోని 29 పంచాయతీల్లో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు, సభ్యులు గ్రూపు రాజకీయాలను పక్కనపెట్టి మహానాడుకు తరలిరావాలని కోరారు.

నగర పంచాయతీలో పరిసరాల పరిశుభ్రం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మేరా లైఫ్, మేరా స్వచ్ఛ 'సేహర్' కార్యక్రమాన్ని సోమవారం నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ ఆధ్వర్యంలో జ్యూట్‌మిల్ పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్తా చెదారం తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ శానిటరి ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జ్ బి.శ్రీనివాస రావు, మేస్త్రీ నాగ మధు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడికి సత్కారం

ప్రజాశక్తి- గుర్ల

టిడిపి జిల్లా నాయి బ్రాహ్మణ కమిటీ కార్యదర్శిగా నియమితులైన బెల్లాన సత్యనారాయణను సోమవారం తెట్టంగి గ్రామ టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర టిడిపి బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు నాగులపల్లి నారాయణరావు చేతులు మీదుగా ఈ సత్కారం చేశారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొంది రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు గేదెల లక్ష్మునాయుడు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కొత్త కమిటీ కృషి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కొత్త కమిటీ కృషి చేస్తుందని ఆ సంఘం నూతన జిల్లా అధ్యక్షులు అయ్యప్ప తెలిపారు. విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. విజయనగరం జిల్లాకు సంబంధించిన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్ రావు కొత్తగా ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా అధ్యక్షునిగా అయ్యప్ప, ప్రధాన కార్యదర్శిగా ధూపం రవికుమార్, కోశాధికారిగా పావాడ సాయి శంకర్, అసోసియేట్ అధ్యక్షులుగా అమర్, జాయింట్ సెక్రటరీగా శంకర్, కార్యనిర్వాహక సభ్యులుగా షేక్ మదీనా, వేణు బాబు, శ్రీకాంత్, భాగ్యశ్రీ, శివప్రసాద్, ఈశ్వరరావు, అజహర్, మాధురిలు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్, ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

నియామకపత్రం అందిస్తున్న రాష్ట్ర నాయకులు

అధికారులు ఫుల్..సభ్యులు నిల్

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- డెంకాడ

మండల సమావేశం అంటే ప్రజా ప్రతినిధులు, సభ్యులు ముందు ఉండాలి. కానీ ఇక్కడ జరిగిన సమావేశంలో అధికారులు ఫుల్లుగా వచ్చినప్పటికీ సభ్యులు ఎవరూ హాజరు కాలేదు. సభ్యులు కోసం ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు సమావేశ నిర్వహించకుండా ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. అయితే సమావేశానికి సభ్యులు ఎవరూ ఇన్ టైంలో హాజరు కాకపోవడంతో వారి కోసం ఎదురు చూడవలసి వచ్చింది. ఎప్పటికీ సభ్యుల రాకపోవడంతో ఎంపిపి స్వయంగా సభ్యులందరికీ ఫోన్ చేసి సమావేశానికి కోరం సరిపడినంత మంది సభ్యులను రప్పించి సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించారు. ప్రతి సమావేశంలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సభ్యులు కోసం ఎదురుచూడటం తప్పడం లేదు. సమావేశాల్లో తమ గ్రామాలకు చెందిన సమస్యలను చెప్పినా పరిష్కారం కావడం లేదన్న కారణంతో చాలా మంది సభ్యులు సమావేశాలకు రావడం లేదన్న వాదన వినిపిస్తోంది. కాగా సోమవారం వచ్చిన సభ్యులు మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు అందరూ ప్రజల సమస్యలపై స్పందించడం లేదని, సమావేశంలో అడిగిన వాటికి అధికారులు సమాధానం చెప్పట్లేదని, సమస్య పరిష్కారం కోసం దృష్టి సారించడం లేదని సభ్యులు ఆరోపించారు, దీంతో తూతూ మంత్రంగా సమావేశాన్ని నిర్వహించి ముగించారు ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు పిన్నింటి తమ్మినాయుడు, కూరాకుల అనిత, పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఇఒపిఆర్‌డి ఎన్ అప్పల నాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వాసుదేవరావు

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-కొత్తవలస

శృంగవరపుకోట సభలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యలకు నిరసనగా కొత్తవలస జంక్షన్‌లో వైసిపి శ్రేణులు సోమవారం ఆందోళనకు దిగాయి. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు మాట్లాడుతూ వైసిపి పాలనలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణ చేసినందుకు చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, మేలాస్త్రి అప్పారావు, గొరపల్లి రవి, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన

వేపాడ : చంద్రబాబు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యాన వేపాడలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఎంపిపి డి.సత్యవంతుడు, డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామునాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, బిసి సెల్ నాయకులు ఎం.సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు ఎం.జగన్నాథం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు పాల్గొన్నారు.

వేపాడ : నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ఆడిటింగ్ పేరిట మెప్మా దోపిడీ

నగర పంచాయతీ కార్యాలయం వద్ద టిడిపి ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో ఆడిటింగ్ పేరుతో డ్వాక్రా సంఘాల నుంచి మెప్మా సిబ్బంది దోపిడికి పాల్పతున్నారని టిడిపి కౌన్సిలర్లు ఆరోపించారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆడిటింగ్ దోపిడీ పై టిడిపి కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతిలో మెప్మా సిబ్బంది సుమారు 509 గ్రూపుల నుంచి ఆడిటింగ్ నిమిత్తం ప్రతీ గ్రూప్ నుంచి రూ.250 చొప్పున రూ.1,27,250 వసూలు చేసి దోపిడీకి పాల్పడినట్లు ఆరోపించారు. గత 30 సంవత్సరాలుగా ఎప్పుడు ఇలా ఆడిటింగ్ నిమిత్తం వసూలు చేయలేదని ఇదొక కొత్త రకం దోపిడీ అని ఎద్దేవా చేశారు. ఇద్దరు మనుషులు ఆడిటింగ్ పేరుతో జిల్లా అంతటా సుమారుగా కోటి రూపాయలు నెల రోజులలో వ్యవదిలో ఆర్‌పి, సిఒ, సిఎంఎం వంటి అధికారుల సహకారంతో వసూలు చేసారని తెలిపారు. నిరుపేద డ్వాక్రా మహిళలు నుంచి వసూలు చేయడం సిగ్గుచేటని, ఆడిటింగ్ స్కాం పై విచారణ జరిపి నిందితులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్‌చ చేశారు. మెప్మా అధికారులు ఇంతవవరకూ రాని 169 గ్రూపుల చివరి విడత ఆసరా డబ్బులు సుమారు రూ.69 లక్షలు ఆయా గ్రూపులకు ఇచ్చేలా కృషి చేయాలని, పావలా వడ్డీ చెక్కులు సకాలంలో గ్రూపుల అకౌంట్స్‌కి జమ అవ్వడానికి కృషి చేయాలి కానీ డ్వాక్రా మహిళల డబ్బులు ఆడిటింగ్, ఇతర కారణాలతో దోచుకోవడాన్ని ఖండిస్తున్నామని కౌన్సిలర్లు అవనాపు సత్య నారాయణ, లెంక హైమావతి, కింతాడ కళావతి, నరవ రామ లక్ష్మీ, ముడిమంచి లక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లెంక అప్పల నాయుడు, ముడుమంచి లక్ష్మణ, మజ్జి ఆదినారాయణ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సమావేశం

ప్రజాశక్తి- మెంటాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూ.తూ మంత్రంగా సాగింది. ప్రజా సమస్యల ప్రస్తావనే లేకుండా పోయింది. ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రజా ప్రతినిధులతోపాటు అధికారులు కూడా అంతంత మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశంలో విద్యుత్తు శాఖకు సంబంధించిన పలు సమస్యలపై ఆయా గ్రామాల సర్పంచులు ఆ శాఖ అధికారులను నిలదీశారు. గ్రామాల్లో ఇళ్ల పైనుండి వెళుతున్న కరెంట్ తీగలను మార్చడంలో, స్తంభాల మార్పుపై అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు పడటం లేదని, అందుకు తగిన కారణాలు అధికారులు దగ్గర లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందని ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పొట్నూరు దుర్గ, ఎంపిడిఒ త్రివిక్రమరావు, తహశీల్దార్ ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతకు నిలువుటద్దం వాలంటీర్ వ్యవస్థ

ప్రజాశక్తి-గంట్యాడ

పారదర్శక పాలనకు నిలువుటద్దంగా వాలంటీర్ల వ్యవస్థ మారిందని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మండలంలోని పెద్దమజ్జిపాలెంలో వాలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థ ఏర్పడిన తరువాత సంక్షేమ పథకాలు అమలు తీరుపై దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూస్తోందన్నారు. అనంతరం వాలంటీర్లకు వివిధ సేవా పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి హైమావతి, జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్, సర్పంచ్ నాయుడు తాత, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లతోనే విశిష్ట సేవలు : శంబంగి

రామభద్రపురం : వాలంటీర్లతోనే ప్రజలకు విశిష్ట సేవలు అందుతున్నాయని, ఈ వ్యవస్థ ఒక విప్లవమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. మండల కేంద్రంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన వాలంటీర్లకు సత్కార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం అవార్డులు అందుకున్న వాలంటీర్లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పారదర్శకంగా అర్హులైన వారికి అందజేసేందుకు మరింత బాధ్యతగా పనిచేసి, మరిన్ని సత్కారాలు పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, వైస్ ఎంపిపిలు బెల్లాన ప్రసాద్, పెంకి అరుణ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, పిఎసిఎస్ అధ్యక్షులు కిర్ల చంద్రశేఖర్, జెసిఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, ఎంపిడిఒ రమామణి పాల్గొన్నారు.



గంట్యాడ : వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య తదితరులు

వాలంటీర్లకు వందనం

పూసపాటిరేగ : సంక్షేమ పథకాలు ఇంటింటికి చేర వేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న వాలంటీర్లకు మనమంతా వందనం చేయాలని ఎంపిపి మహంతి కళ్యాణి అన్నారు. సోమవారం మండలంలోని కొప్పెర్ల, వెల్దురు, తిప్పలవలస గ్రామాల సచివాలయాల వాలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాలంటీర్లకు వారు చేసిన సేవలను గుర్తించి సత్కరించారు. ఈ ప్రభుత్వంలో వాలంటీర్ పాత్ర ఎనలేనిదని ఆమె తెలిపారు. నిస్వార్థంగా వాలంటరీగా సేవ చేస్తున్న ఇటువంటి వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, నాయకులు పుప్పాల లక్ష్మీనారాయణ, మండల జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ఎంపిడిఒ రామారావు, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : దేశం మొత్తం మన వాలంటీర్ వ్యవస్థ వైపు చూస్తుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలో ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లకు పురస్కారాలను ప్రదానం చేశారు.

జొన్నవలసలో వాలంటీర్‌ను సన్మానిస్తున్న జెడ్‌పిటిసి, సర్పంచ్ తదితరులు

కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ శానాపతి బాలసన్యాసమ్మ, ఉప సర్పంచ్ అప్పారావు, నాయకులు చంద్రరావు, ఎంపిడిఒ శేషుబాబు, ఇఒపిఆర్‌డి పాత్రో, పిటిసి సన్యాసప్పడు పాల్గొన్నారు.

వాలంటీర్లకు సన్మానం

విజయనగరం రూరల్ : మండలంలోని జొన్నవలస,రాకోడు పంచాయతీల్ల ఉత్తమ సేవలు అందించిన 35 మంది వాలంటీర్లను సోమవారం సన్మానించారు. జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, సర్పంచ్ కంది రమాదేవి, గ్రామ అధ్యక్షులు కంది గణపతి, కార్యదర్శి సిహెచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి శ్రీనివాసరావు మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత ప్రజల ముగింటకే పలు రకాల సేవలు వచ్చాయన్నారు. పేదలకు ప్రభుత్వ పథకాలను అందించడంతో పాటు అనేక రకాల సేవలను సచివాలయాల ద్వారా అందిస్తున్నారని తెలిపారు. ఈనేపథ్యంలోనే వాలంటీర్ల సేవలను గుర్తించి ప్రభుత్వం వారిని సన్మానించడంతో పాటు నగదు ప్రోత్సాహకాలు కూడా అందించిందని తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మండలం కంటకాపల్లి పంచాయతీ కొత్తూరులో 2021 సంవత్సరంలో జరిగిన హత్య కేసులో నిందితుడు ఇనపచప్ప చింతాలుకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ జిల్లా మహిళా కోర్టు జడ్జి మీనాదేవి సోమవారం తీర్పు చెప్పినట్లు సిఐ బాల సూర్యారావు తెలిపారు. కొత్తూరు గ్రామానికి చెందిన ఇనపచప్ప చింతాలు తన భార్య దుర్గమ్మను శారీరకంగా, మానసికంగా వేధించడంతోపాటు, ఆమెను అనుమానించి హత్య చేశాడు. ఈ విషయమై కొత్తవలస పోలీసు స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాది మేరకు అప్పటి కొత్తవలస ఎస్ఐ కేసు నమోదు చేయగా, సిఐ దర్యాప్తు చేపట్టారు. కోర్టు విచారణలో నిందితుడు నేరారోపణలు రుజువు కావడంతో నిందితునికి, జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మట్టిలో కూరుకుపోయిన వ్యాను టైరు

త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-వేపాడ

ఎంఇఒ కార్యాలయానికి సోమవారం పుస్తకాలను తీసుకొచ్చి తిరుగు పయనమైన వ్యాను ప్రమాదానికి గురైంది. సీతంపేట, జగ్గయ్యపేట మధ్య నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్ద మట్టిలో టైరు కూరుకుపోవడంతో ఒకవైపు ఒరిగిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో అందులో ఉన్న వారెవరికీ ఏమీ కాలేదు. అనంతరం జెసిబి సహాయంతో వ్యానును బయటకు తీశారు. రాకపోకలకు ఆటంకం లేకుండా చేశారు.

కల్వర్టు వద్ద పక్కకు ఒరిగిన వ్యాను

స్పందనకు రెండు వినతులు

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి రెండు వినతులు వచ్చినట్లు ఎంపిడిఒ పప్పు సుదర్శన్, తహశీల్దార్ ఎం.అరుణకుమారి తెలిపారు. పిఆర్ఐ సబ్ డివిజన్లో ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన అవుట్‌సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న వై.శంకర్రావుకు 11 నెలలుగా జీతాలు చెల్లించలేదని వినతి అందించారు. ఎన్.జి.ఆర్.పురం గ్రామానికి చెందిన వృద్ధురాలు స్థల వివాదంపై వినతి సమర్పించారు.

కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

గజపతినగరం : గజపతినగరంలోని జయంతి కాలనీలో సోమవారం కాలువల నిర్మాణానికి సర్పంచ్ నరవ కొండమ్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడ్డ కాలనీవాసులకు ఉపశమనం లభించినట్లు అయ్యిందన్నారు. వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, కర్రి నానాజీ, కార్యదర్శి మంత్రి రమణ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

శృంగవరపుకోట : మండలంలోని తాటిపూడి గ్రామంలో హాట్స్ సంస్థ అధ్యక్షులు ఎం.త్రినాథ ఆధ్వర్యాన 30 మంది పేదలకు నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. సోమవారం లైబ్రేరియన్ మహేష్ విద్యార్థులకు కథలు పుస్తకాలు ఇచ్చి చదివించారు. వేసవిలో ఈ శిబిరం వల్ల విద్యార్థులకు పుస్తకాలపై మక్కువ పెరుగుతోందన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

గ్రోత్ సెంటర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణించాడు. ముగ్గురు గాయపడ్డారు. పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌తో పిక్కరాయి లోడ్ తరలిస్తుండగా గ్రోత్ సెంటర్ వద్ద ట్రక్కుకు పంక్చర్ అయింది. దీంతో డ్రైవర్ ట్రక్కును రోడ్డు పక్కన నిలుపుదల చేసి వెళ్లిపోయాడు. రోడ్డు పక్కన ఉన్న ట్రాక్టర్ ట్రక్కును బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామానికి టాటా ఏస్ వ్యాన్ బలంగా ఢీకొంది. దీంతో వ్యాన్‌లో ఉన్న బోనెల సాంబయ్యకు గాయాలయ్యాయి. రోడ్డుపై ఉన్న ట్రాక్టర్ ట్రక్కును, వ్యాన్‌ను క్రేన్ సహాయంతో పోలీసులు తీసేందుకు ప్రయత్నించారు. ఈలోగా ముగ్గురు యువకులు గ్రోత్‌సెంటర్ నుంచి బొబ్బిలి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డుపై ఉన్న ట్రాక్టర్ ట్రక్కు, వ్యాన్‌ను బలంగా ఢీకొన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న యువకుడు కోట్ల సురేష్, వెనుక కూర్చున్న బూర్లి చిన్నారావు తీవ్రంగా, మరో యువకుడు సురేష్ స్వల్పంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. తీవ్రంగా గాయపడిన కోట్ల గణేష్(23) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించాడు. చిన్నారావుకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మితిమీరిన వేగంతో వెళ్లడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు చెపుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. గణేష్ బిటెక్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు. గణేష్ తండ్రి శ్రీనివాసరావు విశాఖ ప్రభుత్వ ఐటిఐలో పని చేస్తున్నారు. తల్లి రమణమ్మ, సోదరుడు సత్యనారాయణ ఉన్నారు.

మృతిచెందిన గణేష్ (ఫైల్)

బహిరంగ పత్రిక ప్రకటన

శ్రీ కొక్కిరి రాంబాబు తండ్రి లేటు గురుమూర్తి, నివాసం D.No.14-5-37, కమ్మవీధి, విజయనగరం జిల్లా అను నేను ఇందుములముగా ఎల్లరుకు తెలియజేయడమైనది.

నా తల్లి గారు అయిన శ్రీమతి కొక్కిరి సీతయ్యమ్మ W/o లేటు గురుమూర్తి గారు కమ్మ వీధిలో ఉన్న D.No.14-5-37 గల గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తుగా కలిగిన ఆర్.సి.సి.స్లాబ్ గల ఇంటికి సంపూర్ణ హక్కుదారైయున్నారు సదరు ఆస్తి నా తల్లి గారు మరియు నా తండ్రి గారు అయిన (లేటు) శ్రీ కొక్కిరి గురుమూర్తి గారు తే:27.02.1964 దిన మా తల్లి గారు పేరున Registration చేయించిన సెటిల్మెంట్ దస్తావేజు ద్వారా సంక్రమించినది. సదరు ఇంటిపన్ను నెం.1093033922 మరియు కొళాయి పన్ను నెం. 1093001860 విజయనగరం నగరపాలక సంస్థ వారికి నా తల్లిగారు అయిన శ్రీమతి కొక్కిరి సీతయ్యమ్మ గారి పేరున పన్ను చెల్లించుచున్నాను. నా తల్లిగారు అయిన శ్రీమతి కొక్కిరి సీతయ్యమ్మ భర్త (లేటు) గురుమూర్తి గారు ఆమె జీవితకాలంలో తే:25.11.1997దిన సదరు కమ్మవీధిలో యున్న డోర్ నెం.14-5-37 గా కలిగిన గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తుగా కలిగియున్న ఆర్.సి.సి.స్లాబ్ గల ఇంటికి ఆమె తదనంతరం నాకు సర్వహక్కులతో చెందే విధముగా Un-Registered వీలునామను వ్రాసియున్నారు. నా తల్లి గారు తే:26.08.1998 దిన స్వర్గీయులైనారు తదుపరి నా తల్లి గారు వ్రాయించిన Un-Registered వీలునామా తేది 25.11.1997 ప్రకారము మరియు ఆమె కుమారునిగా వారసత్వ రీత్య సదరు కమ్మవీధిలో ఉన్న D.No.14-5-37 గల గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తుగా కలిగిన ఆర్.సి.సి.స్లాబ్ గల ఇంటికి నేను సంపూర్ణ హక్కుదారునిగా అయి యున్నాను. ప్రస్తుతము సదరు కమ్మవీధిలో ఉన్న D.No.14-5-37 గల ఇంటికి, ఇంటి పన్ను మరియు కొళాయి పన్ను శ్రీమతి కొక్కిరి సీతయ్యమ్మ గారి పేరు నుండి నా పేరున అనగా శ్రీ కొక్కిరి రాంబాబు తండ్రి లేటు గురుమూర్తి మార్పు చేయుటకు విజయనగరం నగపాలక సంస్థ వారికీ ధరఖాస్తు చేసియున్నాను. ఇందు నిమిత్తం ఎవరికి అయిన ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేది నుండి (7) ఏడు దినములోగా శ్రీ కొక్కిరి రాంబాబు తండ్రి లేటు గురుమూర్తి, విజయనగరం వారికి లిఖితపూర్వకముగా తెలుపగలరు. లేని యెడల నా పేరున చేయు సదరు పేరు మార్పులకు ఎవరకి ఎటువంటి అభ్యంతరుములు లేవని భావించి తదుపరి చర్యలు తీసుకొనగలవారము, అని ఈ ప్రకటన మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

ఇట్లు,
కొక్కిరి.రాంబాబు.

నా చిరునామా:
శ్రీ కొక్కిరి.రాంబాబు తండ్రి లేటు గురుమూర్తి,
పోన్.నెం.8555953882, డోర్.నెం.14-5-37, కమ్మ వీధి,
విజయనగరం జిల్లా.

మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS 168/2020

Between:
శ్రీ వెలగల గణపతిరెడ్డి ....వాది
Vs
శ్రీ ఈపర్తి ఆదినారాయణ ....ప్రతివాది

To
శ్రీ ఈపర్తి ఆదినారాయణ, S/o తాత వురఫ్ నారాయణుడు, Door No. 15-20, శగిడివీధి, నెల్లిమర్ల గ్రామం, నెల్లిమర్ల రెవెన్యూ మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో వాదిగారు మీపై పై కోర్టులో దావా పరిహారం రాబట్టుటకు పై నెంబరు దావా వేసియున్నారు. సదరు కేసులో **తే 30-6-2023దీ**న వాయిదా అయిఉన్నది. సదరు కేసులో వాయిదా దినమున మీరుగాని, మీ తరుపున లాయరు గారు గాని పై కోర్టులో వాయిదా దినమున **ఉ॥ గం॥ 10-30ని॥**లకు హాజరు అయి మీ తరుపున వాదన తెలియపర్చుటకు వాయిదా అయి వున్నదని యిందు మూలంగా తెలియపర్చడమైనది. లేనిచో వాయిదా దినమున మీ పరోక్షమందు తీర్మాణం చేయబడును అని యిందు మూలంగా తెలియజేయడమైనది.

Jagarapu Kannam Naidu
వాదితరపు న్యాయవాది,
విజయనగరం

GENERAL PUBLIC NOTICE
BEFORE THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
Succession O.P. No. 4/2023

1) Smt. Devadula Krishnaveni W/o late Koteswara Swamy, Hindu, aged 65 years, resident of D.No.24-1-44, Sunkari Veedhi, Vizianagaram-535 002
2) Smt. Devadula Rajyalaxmi Purnima W/o. Teki Ramesh, Hindu, aged 40 years - rest do -
3) Sri Devadula Guna Vardhan S/o. late Koteswara Swamy, Hindu, Ayrvedic Doctor, aged 38 years, - rest do
4) Smt. Devadula Arudra Kumari W/o. C. Pancha Mukesh, Hindu, aged 36 years, - rest do ......PETITIONERS

Vs

NIL .....RESPONDENTS

Whereas above named Petitioners filed the above SOP No. 4/2023 in the above Then ble Count for ice of SUCCESSTON CERTIFICATE denton Lu Legal Heirs of Late Devadula Koteswan Swamy and that the Petitioners are entided to get transmission of 2000 Shores ad TITAN LTD, in their name

So anybody having any objecting on claims in the above matter, they have to appear before the Hon'ble Senior Civil Judge court Vizianagaram on **15-06-2023 10.30 am** either in person or through an adorate, else the matter will be decided us per law

P.V. Ganesh
Advocate for the petitioner,
Vizianagaram